క్లుప్తంగా

ఆకట్టుకుంటున్న జ్యోతిర్లింగాల ప్రదర్శన

కడప కల్చరల్ : బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం కడప శాఖ ఆధ్వర్యంలో నగరంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాల నమూనాల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ప్రముఖ జ్యోతిర్లింగ క్షేత్రాలైన కేదార్‌నాథ్, సోమనాథ్, వైద్యనాథేశ్వర్, విశ్వనాథ్, నాగేశ్వర ఓంకారేశ్వర, త్రయంబకేశ్వర, మల్లికార్జున, భీమ శంకర, రామేశ్వర, ఘృష్ణేశ్వర తదితర జ్యోతిర్లింగాల నమూనాలను జిల్లాశాఖ కో ఆర్డినేటర్ గీతా బెహన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేశారు. భక్తులు ఈ ప్రదర్శనను తిలకిస్తున్నారు.

డీఈవోకు సన్మానం



డీఈఓ అనూరాధను సన్మానిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారి అనురాధను వ్యాయామోపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి ప్రమీల, రాయుడు, ఖాదర్‌బాషా, లక్ష్మీకర్ పాల్గొన్నారు.

10న పుస్తక పరిచయ సభ

కడప కల్చరల్ : కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం ఉదయం 11 గంటలకు వివేక్ లంకమల రూపొందించిన 'లంకమల దారుల్లో' పుస్తక పరిచయ సభ నిర్వహించనున్నారు. పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు.

రేపు అండర్-17 జిల్లా స్థాయి ఎంపికలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : స్థానిక సీఎస్ఐ మైదానంలో అండర్-17 సీనియర్ బాలుర విభాగంలో జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు డేనియల్ ప్రదీప్, వైస్ ప్రెసిడెంట్ థామస్ జీవన్‌బాబు, కార్యదర్శి సుధీర్‌లు తెలిపారు. కడప జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు జరిగే ఈ ఎంపికలకు క్రీడాకారులు ఆధార్, జనన ధృవీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

నేడు ఆర్టీసీ గ్యారేజీ ప్రారంభోత్సవం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప ఆర్టీసీ బస్టాండులో నిర్మించిన నూతన డిపో గ్యారేజీని శనివారం ఉదయం 12 గంటలకు ప్రారంభిస్తున్నామని కడప ఆర్టీసీ రీజినల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, ఇతర అధికారులు పాల్గొంటారన్నారు. అలాగే నూతనంగా నిర్మించిన కమలాపురం బస్టాండును ఉదయం 10.00 గంటలకు ప్రారంభిస్తారని తెలిపారు.

జె.వెంకట్రామిరెడ్డి సేవలు మరువలేనివి



జె. వెంకట్రామిరెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : దోపిడీ లేని సమాజం కోసం చివరి వరకు పోరాడిన జె.వెంకట్రామిరెడ్డి ఆయన సేవలు మరువలేనివని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం కమ్యూనిస్ట్ నేత జె. వెంకట్రామిరెడ్డి వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వెంకట్రామిరెడ్డి ఉపాధ్యాయ వృత్తిని పక్కనపెట్టి విద్యార్థి యువజన రైతు సంఘాల ఏర్పాటులో కీలక పాత్ర పోషించారన్నారు. నికరజలాల సాధనే లక్ష్యంగా రైతులను సమరశీల పోరాటాలకు సమాయత్తం చేయడమే ఆయనకు ఘనమైన నివాళి అని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్.వెంకటశివ, కేసీ.బాదుల్లా, యం.వి.సుబ్బారెడ్డి, పోతిరెడ్డి భాస్కర్, వి.గంగా సురేష్, పి.మనోహర్ రెడ్డి, సావంత్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం



కార్నియాలను సేకరిస్తున్న సేవా సమితి సభ్యులు

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని ఎర్రిపల్లి గ్రామానికి చెందిన విశ్రాంతి ఉపాధ్యాయుడు సిగిరిరెడ్డి సూర్యనారాయణరెడ్డి (64) శుక్రవారం మృతి చెందాడు. ఆయన భార్య సుశీల, కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి నేత్రదానానికి అంగీకరిస్తూ స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షులు రాజుకు సమాచారం ఇవ్వడంతో ఆయన గ్రామానికి చేరుకుని కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని అగర్వాల్ నేత్రనిధికి పంపినట్లు తెలిపారు.

మహాదేవా.. నమో నమో





పాలతలలో స్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, కుటుంబ సభ్యులు, కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



విజయదుర్గాదేవి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



విశేష అలంకారంలో విజయదుర్గమ్మ



శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు



శివ కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



పాలతలలో అలంకృత కలశాలతో భక్తులు



అన్నదానం చేస్తున్న సాయి యువజన సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి

పెండ్లిమర్రి : శంభో శంకర... హర హర మహదేవా.. అంటూ పొలతల క్షేత్రం శివ నామసర్మణతో శుక్రవారం మార్మోగింది. మహాశివ రాత్రి పర్వదినం సందర్భంగా జిల్లా నలమూలల నుంచేగాక, ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు లక్షల సంఖ్యలో తరలివచ్చి మల్లేశ్వర స్వామి, పార్వతీదేవి, అక్కదేవతలు, పులిబండెన్న స్వాముల వారిని దర్శించుకున్నారు. కోనేటిలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకుంటే సకల పాపాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. ఉత్సవాలకు వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ చైర్మన్ అంబటి నాగమల్లారెడ్డి, ఈఓ శ్రీనువాసులు ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. మల్లేశ్వరస్వామిని ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ ఎ.మల్లికార్జునరెడ్డి, జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్, ఆర్డీఓ మధుసూదన్, .ఉత్సవాల ప్రత్యేక అధికారి విశ్వనాథ్‌లు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

జంగము దేవరకు ఘనంగా పూజలు

– నగర శివాలయాల్లో మార్మోగిన శివనామం

కడప కల్చరల్: మహాశివరాత్రి పర్వదినాన్ని నగర వాసులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని శివాలయాలన్నీ ఉదయం నుంచే భక్తులతో కిటకిట లాడాయి. జిల్లాలోని పురాతన ఆలయాలలో ఒకటైన దేవుని కడప సోమేశ్వర స్వామి ఆలయంలో భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. మోచంపేట ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయం, గడ్డి బజారు సోమసుందరేశ్వరస్వామి ఆలయాలలో భక్తులు పెద్ద సంఖ్యలో కనిపించారు. నబీకోట మల్లికార్జున, సర్వమంగళాదేవి ఆలయం, మృత్యుంజయకుంట శివాలయం, ప్రకాశ్‌నగర్‌లోని అమరేశ్వరస్వామి ఆలయం, మున్సిపల్ మైదానంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయం, హౌసింగ్‌బోర్డు లోని శివాలయాలు, సీపీ బ్రౌన్, మారుతీనగర్, రవీంద్ర నగర్ తదితర శివాలయాల్లో లింగాష్టకం, బిళ్వపత్ర పూజలు, రుద్రహోమాలు నిర్వహించారు.

కల్యాణోత్సవాలు

నగరంలోని శివాలయాల్లో ఉదయం, సాయంత్రం, రాత్రి కూడా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాలను వైభవంగా నిర్వహించారు. పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో ప్రత్యేకంగా మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని దాదాపు మూడున్నర గంటల నుంచి నాలుగు గంటల సేపు నిరంతరాయంగా నిర్వహించారు.

జాగరణలు

శివరాత్రి నాడు శివ పూజలు చేసినా, శివనామ స్మరణ చేసినా, శివనామం విన్నా ముక్తి లభిస్తుందన్న విశ్వాసం లభిస్తుండడంతో పలువురు భక్తులు శివాలయాల్లో జాగరణలు చేశారు. ఈ సందర్భంగా హరికథలతో శివపురాణాన్ని నిర్వహించారు. మరికొన్నిచోట్ల సంగీత కచేరీలు, పౌరాణిక నాటక ప్రదర్శనలు నిర్వహించారు.

శివుడికి పంచామృతాభిషేకం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగర శివారులోని ఊటుకూరు గ్రామంలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ సన్నిధిలోని శివాలయంలో ఆలయ చైర్మెన్ గోసుల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు సుబ్బనరసయ్య శర్మ శివపార్వతుల కళ్యాణం నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం జరిపారు. రాత్రి స్వామి, అమ్మవారి ఊరేగింపులో భక్తులు పాల్గొన్నారు. పోటో

భక్తిశ్రద్ధలతో శివ కల్యాణం

కడప కల్చరల్ : నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ కోదండ రామాలయ ప్రాంగణంలో శుక్రవారం శివ పార్వతులకు కల్యాణాన్ని నిర్వహించారు. ధర్మకర్త డి.వెంకటరెడ్డి, అర్చకులు స్వామి, అమ్మవారిని వేదికపై కొలువుంచి సంప్రదాయం ప్రకారం కల్యాణం జరిపారు. భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు. వైఎస్సార్ కాలనీలోని మల్లికార్జున స్వామి ఆలయంలో సాయంత్రం స్వామి, అమ్మవార్లకు కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

భక్తులకు అన్నదానం

కడప కార్పొరేషన్ : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగాసాయి యువజన సేవా సంఘం చైర్మన్ మలిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలోకడప జడ్పీ కాంపౌండ్ లోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కడప తిరుమల టింబర్ డిపో అధినేత కంచి గోపికృష్ణ, సూర్య డెవలపర్స్ అధినేత కంచి సురేంద్రనాథ్ (సూరి) సహకారంతో అన్నదానం చేయడం పూర్వజన్మ పుణ్యఫలం అన్నారు. ఈ కార్యక్రమంలో శంకరాపురం అశోక్ కుమార్, వల్లి భాషా, భాస్కర్ రెడ్డి, మాధవరెడ్డి, శివశంకర్, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం

కడప కల్చరల్ : విజయదుర్గాదేవి ఆలయంలో అర్చక బృందం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్ తదితర భక్తులు సామూహిక రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. శుక్రవారం కావడంతో అమ్మవారికి మహిళా భక్తులు సామూహికంగా సుమంగళి పూజ నిర్వహించారు. అనంతరం పల్లకీ సేవ జరిగింది.

కుటుంబ బాధ్యతల్లో మహిళలే కీలకం



మహిళా ఖైదీలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు



మహిళలను సత్కరిస్తున్న జన వికాస్ సేవా సంస్థ ప్రతినిధులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : కుటుంబ బాధ్యతల్లో మహిళలే కీలకమని, ఒడిదుడుకులు ఎదురైనా సహనంతో ముందుకెళ్లాలని సాధించుకోవాలని జైలు సూపరింటిండెంట్ కృష్ణవేణి అన్నారు. నెహ్రూ యువ కేంద్రం, వికసిత ఫౌండేషన్ సంయుక్తంగా కడప మహిళా కారాగారంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించాయి. కృష్ణవేణి మాట్లాడుతూ కొందరు మహిళలు క్షణికావేశాలకు పోయి జీవితాలను దూరం చేసుకుంటున్నారన్నారు. మహిళా సాధికారత కోసం న్యాయ పోరాటం చేసిన వీరవనితల గురించి తెలుసుకుని వారి అడుగు జాడల్లో నడవాలన్నారు. వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మిదేవి మాట్లాడుతూ అమెరికా వంటి ధనిక దేశాల్లో మహిళలకు ఉన్న హక్కులు, చట్టాలు గురించి వివరించారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలన్నారు. అనంతరం ఖైదీలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జైలర్ భువనేశ్వరి, డిప్యూటీ జైలర్ చిన్న ఇమాంబీ, శరత్ చంద్ర, మహిళా ఖైదీలు పాల్గొన్నారు.

'జన వికాస్' ఆధ్వర్యంలో

జన వికాస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో కడప నగరంలోని కాగితాల పెంటలో ఉన్న ది నేషనల్ హైస్కూల్‌లో సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎం డీ.తాహిర్ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ అంతర్జాతీయంగా మహిళలు తమ హక్కులను గుర్తించి వాటి సాధనకోసం ఉద్యమించాల్సిన కర్తవ్యాన్ని తెలియజేసారు. ఈ కార్యక్రమానికి సఖీ వన్ స్టాప్ సెంటర్ మేనేజర్ అశ్విని, పల్లవి, ఖదీరున్, వయోజన విద్య డీడీ అజాద్, పీవీ.రమణ, జేకే.ఖాదర్‌బాషా, డాక్టర్ శ్రీనివాసులు, నాసర్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

మహిళల హక్కుల కోసం పోరాటం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : మహిళల హక్కుల కోసం ప్రతి ఒక్కరూ పోరాటం చేయాలని ఏపీ మహిళా సమాఖ్య జాతీయ కౌన్సిల్ సభ్యురాలు సి.బషీరున్నిషా పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నగరంలోని మదరసాలో శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళ విద్యాబుద్ధులతో ముందుకు సాగుతూ, నేడు ఆకాశంలో ప్రయాణించేందుకు సిద్ధమైందన్నారు. నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో ఆప్‌కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్ భాషా ఆధ్వర్యంలో మహిళలు కేక్ కట్ చేశారు. నగరంలోని ఇందిరాభవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు శ్యామలమ్మ తదితరులు పేర్కొన్నారు.

పార్కులతో ఆహ్లాదకర వాతావరణం



జర్నలిస్టు కాలనీ పార్కును ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : పార్కుల నిర్మాణంతో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుందని ఉప ముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎస్.బి. అంజాద్‌బాషా అన్నారు. నగరంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ పార్కు, రిమ్స్ ఆస్పత్రి వద్ద జర్నలిస్ట్ కాలనీ పార్కును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ కడప నగరం సుందరీకరణ భాగంలో అన్ని దిశలా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. రూ.60 లక్షలతో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ పార్క్, రూ.1.30 కోట్లతో జర్నలిస్టుల కాలనీ వద్ద పార్కు నిర్మించారన్నారు. వైఎస్.జగన్ మోహనరెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. అనంతరం పార్కులోని ఆట వస్తువులను స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగం, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.ప్రసాద్ రెడ్డి, త్యాగరాజు, ఎస్.సుబ్బారెడ్డి, తోటక్రిష్ణ, బంగారు నాగయ్య, గౌస్, జమాల్‌వలి, రమేష్‌రెడ్డి, అజ్మతుల్లా, ఏ.అలీ, రాకేష్ చంద్ర, కరీముల్లా, తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో పూజలు

మహాశివరాత్రి సందర్భంగా డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు నగరంలోని చలమారెడ్డిపల్లె కొండపై శివాలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. నిర్వహించారు. అనంతరం కొండాయపల్లె ఆలయంలో స్వామిని దర్శించుకున్నారు.. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎం.సుబ్బారెడ్డి, ఎం.రాజగోపాల్‌రెడ్డి, నాగేంద్ర ప్రసాద్, కె.రాజశేఖర్‌రెడ్డి, యల్లారెడ్డి, తోటక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ప్రాధాన్యం

వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాల్లో మహిళలకు ప్రాధాన్యం కల్పించిందని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా అన్నారు. ।గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అల్మాస్ పేట సచివాలయం పరిధిలో శుక్రవారం ఆయన పర్యటించారు. సీఎం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి బుక్‌లెట్ అందజేశారు. ఎస్.బి.అంజాద్ బాషా మాట్లాడుతూ.. పాదయాత్రలో పేదల కష్టాలు తెలుసుకున్న జగన్‌మోహన్ రెడ్డి నవరత్నాల పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అర్హత ఉన్న పేదలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న సీఎంకు ప్రజల నిండు దీవెనలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కమిషన్ డైరెక్టర్ జఫ్రుల్ల, ఆయుబ్, రమేష్ రెడ్డి, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం గంగమ్మ జాతర ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ మహబూబ్ బాషా

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మ జాతర ఏర్పాట్లను శుక్రవారం రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా పరిశీలించారు. ఈనెల 11, 12వ తేదీలలో జరగబోవు గంగమ్మ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 500 మంది పోలీసులను, ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అమ్మవారి దర్శనానికి భారీ సంఖ్యలో వచ్చే భక్తుల కోసం ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. జాతరలో జూదాలు, అక్రమ మద్యం విక్రయాలు, దొంగతనాలు జరిగితే కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే సోమవారం రాత్రి చాందినీ బండ్లు వద్ద ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేస్తామన్నారు. వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకొని వాహనాల స్టాండ్‌లను ఏర్పాటు చేయాలని సీఐ గంగనబాబు, ఎస్ఐ విష్ణువర్ధన్‌లకు సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రవీంద్రరాజు, ఆలయ చైర్మన్ ఎం.రెడ్డయ్య, కమిటీ సభ్యులు, పూజారులు రామయ్య, గంగాధర్‌లు పాల్గొన్నారు.

అన్ని రంగాలలో ఆర్థిక అభివృద్ధి సాధించాలి

చెన్నూరు : మహిళలు అన్ని రంగాలలో ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని ఎంఈఓ-2 సునీత తెలిపారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక విద్యాశాఖ అధికారి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓ-2 సునీత మాట్లాడారు. ఏ కుటుంబంలోనైనా మహిళ లేకుంటే ఆ కుటుంబ పురోగతి సాధించలేదన్నార. ఎంఈఓ గంగిరెడ్డి మాట్లాడుతూ, నేటికీ మహిళల అక్షరాస్యత తక్కువగా ఉందని, అక్షరాస్యత సాధించే దిశగా వారిని ప్రోత్సహించాలన్నారు. మహిళా ఉపాధ్యాయులను ఆయన ఘనంగా సత్కరించారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : మహిళల అభివృద్ధితోనే దేశాభివృద్ధి అని ఎంఈఓ చంద్రశేఖర్‌రావు తెలిపారు. శుక్రవారం మహిళ దినోత్సవం సందర్భంగా ఎస్‌టీయూ రీజనల్ కార్యాలయంలో గురుకుమార్ అధ్యక్షతన మహిళలకు సన్మానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలను చదివించుకుంటే ఆ కుటుంబం బాగుపడుతుందన్నారు. అనంతరం ఉపాధ్యాయునులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ చౌడయ్య, పరయేశ్వరయ్య, శివశంకర ప్రసాద్, రంగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే రోటరీ క్లబ్బు అధ్యక్షుడు కె.వి.మురళీధర్‌రెడ్డి మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణంలో వివిధ రంగాలల్లో ప్రతిభ చూపిన మహిళలకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ లత, రోటరీ క్లబ్బు మాజీ అధ్యక్షుడు కుండా భాస్కర్, పాలనాగేశ్వరరెడ్డి, ఎంఎల్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : ప్రతి మహిళ తమ హక్కులను సాధించుకోవడానికి సంఘటితంగా పోరాడేందుకు ముందుకు రావాలని ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు మాలేపాటి లక్ష్మీదేవి తెలిపారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని స్థానిక శ్రీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో కమలాపురం గ్రేటర్ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహిళలకు వివిధ రకాల పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

నేడు ఆర్టీసీ బస్టాండు ప్రారంభం



ప్రారంభానికి సిద్ధంగా ఆర్టీసీ బస్టాండు

కమలాపురం : పట్టణంలో నూతనంగా నిర్మించిన ఆర్టీసీ బస్టాండును శనివారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి ప్రారంభిస్తారని వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ గంగాధర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే క్రాస్ రోడ్డు సమీపంలో నిర్మించిన ఆర్బీ, డివైడర్, సీసీ రోడ్డును కూడా ఎమ్మె ల్యే, ఎంపీ, ఆర్టీసీ చైర్మన్ ప్రారంభిస్తారని ము న్సిపల్ వైస్‌చైర్మన్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు తెలిపారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి పరీక్షలు

తొండూరు : మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాలలో ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ ఉషారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాల కొరకు ఈనెల 10వ తేదీన వ్రాత పరీక్షలు నిర్వహిస్తామన్నారు. 10వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు 5వ తరగతి విద్యార్థినులకు, జూనియర్ ఇంటర్మీడియట్ విద్యార్థినులకు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వ్రాత పరీక్షలు నిర్వహిస్తామన్నా రు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్, గుర్తింపు పత్రము, ఒక బ్లాక్ లేదా బ్లూ పెన్ను తీసుకుని ఒక గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. హాల్ టికెట్‌లో ఏవైనా తప్పులున్నచో సంబంధిత హెచ్ఎంతో స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు ఒరిజనల్ తీసుకు ని రావాలన్నారు. వివరాలకు 9704550129 నెంబరును సంప్రదించాలన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీరాములపేటలోని ఎమ్మెల్సీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధినుంచి మంజూరైన రూ.3లక్షల చెక్కులను ఎమ్మెల్సీ ఆర్.రమేష్ యాదవ్ శుక్రవారం శ్రీరాములపేటలోని తన కార్యాలయంలో ముగ్గురు లబ్ధిదారులకు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల వైద్యానికి పెద్దపీట వేస్తోందన్నారు.

అనాథవృద్ధుడికి అంత్యక్రియలు

కమలాపురం : పట్టణం వికలాంగుల కాలనీకి చెందిన అనాథ వృద్ధ శవానికి అభి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. వికలాంగుల కాలనీకి చెందిన మధుర మణిరావు అనే వృద్ధుడు ఎవరూ లేక అనాధ ఉండి తిండికి సైతం ఇబ్బంది పడుతూ ఉంటే ఇటీవల అభి ట్రస్ట్ చైర్మన్ విజయ్‌బాబు ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి సహకారంతో తిప్పలూరులోని వృద్ధాశ్రమానికి తరలించారు.

అక్కడే గురువారం రాత్రి వృద్ధుడు మృతి చెందాడు. అనాథ వృద్ధుడి శవానికి సాంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు.

రేపు నూతన విద్యావిధానంపై అవగాహన సదస్సు

పులివెందుల : నూతన విద్యావిధానంపై ఆదివారం అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు ఏపీవైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం కడప నగర శివార్లలోని మేడా కన్వెన్షన్ సెంటర్‌లో పశ్చిమ రాయలసీమ టీచర్స్ ఎంఎల్‌సీ రామచంద్రారెడ్డి పర్యవేక్షణలో ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉపన్యాసకులు జె.ఎస్.పరంజ్యోతి, అచలానంద మహారాజ్, విశిష్ట అతిథులుగా కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, కమలాపురం శాసనసభ్యులు రవీంద్రనాథరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు కల్పన, ఎంవి రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, సచివాలయ సంఘ అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ నాయకులు పాల్గొంటారన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఈ సదస్సుల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.